ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

• ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గండిపాళెం వెంగళరావునగర్, దాసరపల్లి, బిజ్జంపల్లి, ఉదయగిరి తదితర ప్రాంతాల్లోని ముస్లింలు ప్రార్థన మందిరాల్లో జరిగిన వేడుకల్లో మిలాద్ ఉన్ నబీ విశిష్టతను, మహమ్మద్ ప్రవక్త జన్మదిన ఆవశ్యకతను మతపెద్దలు వివరించారు. ఉదయగిరి పట్టణంలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రత్యేక ప్రార్థనలు

చేజర్ల: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం చేజర్ల మండలంలోని ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని చేజర్ల, ఉలవపల్లి, ఆదూరుపల్లి తదితర ప్రాంతాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. చేజర్లలోని జామియా మసీదులో ప్రార్థనల అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్, పఠాన్ రసూల్, పఠాన్ అక్బర్, షేక్ అలీఫ్‌అహ్మద్, షేక్ కాలేషా, హజీ ఖాదర్‌బాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం మండలంలో..

అనంతసాగరం, సోమశిల, పాతదేవరాయపల్లి, ఉప్పలపాడు, ఆమని చిరువెళ్ల గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైభవంగా గంధ మహోత్సవం

ఆత్మకూరు: మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకొని నిర్వహించే మిలాద్ ఉన్ నబీ ముందురోజు రాత్రి ఆత్మకూరులోని తూర్పువీధి దర్గా వద్ద గంధ మహోత్సవం నిర్వహించారు. బుధవారం రాత్రి దర్గా వద్ద నిర్వహించిన గంధ మహోత్సవంలో గంధాన్ని దావీద్ వద్ద నుంచి దర్గా వరకు ఫకీరుల విన్యాసాలు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్ ఉన్ నబీ గురించి మిజావర్లు ముస్లింలకు వివరించారు. దర్గాలో సమాధి వద్ద గంధలేపనం చేసిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.



ఉదయగిరి: మిలాద్ ఉన్ నబీ విశిష్టతను వివరిస్తున్న మతపెద్ద

కరటంపాడులో శాంతి ర్యాలీ

ఆత్మకూరురూరల్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మండలంలోని కరటంపాడులో ముస్లింలు గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మసీదుల్లో ప్రార్థనలు అనంతరం బయాను నిర్వహించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ముస్లిం చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

పొంగూరులో మసీదు ప్రారంభం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరులో నూతనంగా నిర్మించిన మసీదును మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం ప్రారంభించారు. కోదాడకు చెందిన తానేదేషిన్ ట్రస్ట్ తరఫున అహమ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మసీదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ మానవాళికి శాంతి సందేశం అందించడం అల్లా ఆకాంక్ష అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొని నమాజు చేశారు. అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కావలిలో రక్తదానం

కావలి: స్వచ్ఛంద రక్తదానం ద్వారా రక్తం కొరతను తీర్చవచ్చని వాయిస్ ఆఫ్ ముస్లిం మైనారిటీ సంస్థ అధ్యక్షుడు మొగల్ సలీం బేగ్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా స్థానిక తుఫాన్‌నగర్‌లోని సుల్తానే మదీనా మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కోవిడ్ విపత్తు సమయంలో తుఫాన్‌నగర్ మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించామని, అప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం కొరత కారణంగా ఎవరి ప్రాణాలు పోకుండా రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మసీదు కమిటీ పెద్దలు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ ముజీబ్, వాసిమ్‌అక్రమ్, షాజహాన్, దస్తగిరి, కాలేషా, వార్డు ఇన్‌చార్జి అబ్దుల్లా, గౌస్‌అహ్మద్, షాలు, రషీద్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సయామ్, పద్మావతి, శేషమ్మ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: గంధ మహోత్సవంలో ముస్లింలు

ఏఎస్‌పేటలో..

అనుమసముద్రంపేట: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం ఏఎస్‌పేటలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏఎస్‌పేట దర్గా సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు.



చేజర్ల: జామియా మసీదులో అన్నదానం చేస్తున్న ముస్లింలు



ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న మతపెద్ద



కావలి: రక్తశిబిరం నిర్వహిస్తూ..



అనుమసముద్రంపేట: ర్యాలీ నిర్వహిస్తూ..

రేపు డిజిటల్ క్లాస్‌రూంలు ప్రారంభం

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలోని టీజీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు డిజిటల్ క్లాస్‌రూంలను ప్రారంభిస్తారని ఆ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం నేతృత్వంలో చింతగుంట సుబ్బారెడ్డి, అనిత సహకారంతో ఈ డిజిటల్ క్లాస్‌రూంలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

నేడు కావలిలో జగనన్నకు చెబుదాం

• వినతులు స్వీకరించనున్న కలెక్టర్

కావలి: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.మాధవరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండలం, కావలి పట్టణంలోని ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

సాయిమందిరంలో అన్నసంతర్పణ

వరికుంటపాడు: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం దాతలు వాలా వెంకటేశ్వర్లు, , ధరణీజరావు దంపతులు, వాలా మనోహర్ – విమలాదేవి ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరంలో సాయిబాబుకు అభిషేకాలు, విశేష పూజలు, కాగడ హారతులు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న యువకులు

సంగం: స్థానిక యువకులు గురువారం సంగం నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సుమారు 50 మంది యువకులు ముందుగా గ్రామంలోని పలు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామాలను ఆలపిస్తూ పాదయాత్రగా బయలుదేరారు. గ్రామంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ 18 ఏళ్ల నుంచి ప్రతి ఏటా పాదయాత్ర చేపడుతున్నట్లు వారు తెలిపారు.

జూదరుల అరెస్ట్

జలదంకి: మండలంలోని గట్టుపల్లి చింతలపాళెం చెరువులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి తన సిబ్బందితో దాడులు చేశారు. పోలీసులు రావడాన్ని గమనించి కొందరు పరారు కాగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.940 స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

కంపచెట్ల తొలగింపు

వరికుంటపాడు: మండలంలోని ఆండ్రావారిపల్లె నుంచి తూర్పుబోయమడుగుల వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని కూడలి మలుపు వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు, విరిగిన పాత విద్యుత్ స్తంభాన్ని గురువారం జేసీబీ సాయంతో తొలగించారు. మలుపు వద్ద కంపచెట్లు విపరీతంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో సర్పంచ్ దిలీప్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకున్నారు.

ఉదయగిరి జిల్లా కోసం ఐక్య పోరాటాలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అన్నివర్గాల వారు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఉదయగిరి సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. మర్రిపాడు మండలం బూదవాడలో ఈ అంశంపై బుధవారం రాత్రి గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి నెల్లూరు, ప్రకాశం, కడప.. ఇలా ఎటు చూసినా ప్రతి జిల్లా కేంద్రం 150 కిలోమీటర్లకు పైగా దూరం ఉంటున్నారు. విద్య, వైద్య, వాణిజ్యపరంగా ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే జిల్లా కేంద్రంగా ప్రకటించడం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి దస్తగిరి అహమ్మద్, సర్పంచ్ హరిబాబు, ఆర్‌ఎంపీ శ్రీరాములు, రబ్బాని దాదా, మురళి, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గీతా మంది వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని అమ్మా యాత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఫౌండేషన్ సేవకుడు శశికిరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో ఆహార పొట్లాలు అందజేశారు. నిర్వాహకులు రమేష్‌బాబు, శశికిరణ్, కార్తికేయ, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలవర్థక ఆహారంపై అవగాహన



కొడవలూరు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పెమ్మారెడ్డిపాళెం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బలవర్థక ఆహారంపై గురువారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పాలు, ఆకు కూరలు, గుడ్లు తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించొచ్చని చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు చంద్రలీలమ్మ, విజయమ్మ, ఆదెమ్మ, కామేశ్వరి, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన కసుమూరులో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. గూడూరుకు చెందిన అమర్లుల్లా పని నిమిత్తం కసుమూరుకు బైక్‌పై వచ్చారు. అనంతరం తిరిగి వెళ్తుండగా, కసుమూరు మలుపు రోడ్డు వద్ద ఆటో అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పింది. గాయపడిన అమర్లుల్లాను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించేలా కృషి

సంగం: ప్రజా సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని మండల అధికారులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ అధ్యక్షురాలు కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై అధికారులు శాఖల వారీగా వివరించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి, తహసీల్దార్ నాగరాజు, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యురాలు రావుల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఘనంగా భగత్‌సింగ్, జాషువా జయంతులు

చేజర్ల(సోమశిల): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్, ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతులను గురువారం చేజర్లలోని గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్, జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ చేసిన పోరాటాలను గ్రంథాలయాధికారి నారాయణరావు విద్యార్థులకు వివరించారు. అలాగే గుర్రం జాషువా కవిత్వంలోని పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు కె.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాదయాత్ర సన్నాహక సమావేశం

ఉదయగిరి: అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే సీపీఎం పాదయాత్రకు సంబంధించి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన పాదయాత్రను ప్రజలు జయప్రదం చేయాలన్నారు. ఈ పాదయాత్ర పది రోజులపాటు కొనసాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

భక్తిశ్రద్ధలతో అనంతపద్మనాభస్వామి వ్రతం



విశేషాలంకారంలో అనంతపద్మనాభస్వామి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న రవీంద్రబాబు

నెల్లూరు(బృందావనం): సంతపేట బ్రాహ్మణవీధిలోని రామ సహిత సత్యనారాయణస్వామి మందిరంలో గల వ్యాసరాజ మఠంలో అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. సుబ్రహ్మణ్య, పవమానసూక్తాభిషేకం, పూజలను ప్రధానార్చకుడు కృష్ణాచార్ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా మాలతి, అశోక్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. వ్యాసరాజ మఠంలో అక్టోబర్ తొమ్మిదిన నిర్వహించనున్న విద్యాపయోనిధుల ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆహ్వాన పత్రికలను మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు ఆవిష్కరించారు. సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, మందిర గౌరవ కార్యనిర్వాహకుడు అరవపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు చెర్లోయడవల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో శనివారం ఉదయం 9 గంటలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభిస్తారని మేకపాటి కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని నాగులపాడు, రావులకొల్లు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. అనంతరం 11.30 గంటలకు ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డాక్టర్ గుండాల సూర్యనారాయణ సహకారంతో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం నేతృత్వంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూం ప్రారంభిస్తారని తెలిపారు.

పేదలకు సేవ చేయడమే ధ్యేయం

కావలి: పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దాత ఏటూరి రామిరెడ్డి తెలిపారు. కావలిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన యావదాస్తి పేదలకు ఉపయోగపడాలనే సంకల్పంతో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ట్రస్టును ఏర్పాటు చేశానన్నారు. ఆధ్యాత్మికత కోసం శివాలయం నిర్మించి, పలు సందర్భాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో పేదలకు రెండు పూటలా భోజనం పంపిణీ చేశామన్నారు. అలాగే వృద్ధాశ్రమంలో ఉచితంగా వృద్ధుల ఆలనాపాలనా చూస్తున్నట్లు తెలిపారు. కల్యాణ మండపం నిర్మించి ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సురే మదన్‌మోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ మాధవరెడ్డి, ఒడుగుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఉపాధి పనులు కల్పించండి

చేజర్ల(సోమశిల): గత కొంతకాలంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు పనులు కల్పించాలని ఉపాధి హామీ కూలీలు కోరారు. గురువారం అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని సచివాలయం వద్ద ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ కూలీలు నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని సర్పంచ్ కోరారు.

వైషమ్యాలను రెచ్చగొడుతున్న టీడీపీ

• వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గ బలిజ, కాపు నాయకుల ఆగ్రహం

కావలి: ప్రజా ధనాన్ని లూటీ చేసి ఆధారాలతో దొరికిపోయిన చంద్రబాబు కోర్టు ఆదేశాల మేరకు జైలులో ఉన్న నేపథ్యంలో కావలిలోని టీడీపీ నాయకులు నిరసన పేరుతో కాపు, బలిజ సామాజిక వర్గీయులను అవమానపరుస్తూ, వైషమ్యాలను రెచ్చగొట్టేలా మాట్లాడడంపై వైఎస్సార్‌సీపీ బలిజ, కాపు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గ బలిజ, కాపు నాయకులు మాట్లాడారు. కావలి టీడీపీలో ఉన్న కమ్మ దళారులు ఉసిగొల్పిన మలిశెట్టి వెంకటేశ్వర్లు బలిజ, కాపులకు వంచన చేసి చైనా ఉరేశాడు. కాపులు నాయకుడు వంగవీటి మోహన రంగాను దారుణంగా హత్య చేసిన టీడీపీ, కాపు రిజర్వేషన్ల ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను, ఆయన కుటుంబాన్ని చిత్రహింసలు పెట్టిన టీడీపీ కాపులకు, బలిజలకు ఏవిధంగా పవిత్రమైన పార్టీ అయిందో ప్రాకిజేల మలిశెట్టి వెంకటేశ్వర్లు చెప్పాలని డిమాండ్ చేశారు. కావలిలో సోదరభావంతో మెలిగే రెడ్డి, కాపుల నడుమ చిచ్చుపెట్టేందుకు మలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రయత్నిస్తున్నారని, సౌమ్యుడైన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్ల దుర్భాషలాడారని, అవసరమైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాపులకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. అలాగే కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కూడా కులమతాలకు అతీతంగా అందరినీ తమ కుటుంబసభ్యులుగా ఆదరిస్తుంటారని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే మలిశెట్టి వెంకటేశ్వర్లు విమర్శలు చేయడం సరికాదన్నారు. కులాలకు కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే తామూ కూడా తీవ్రంగానే స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో తూపిలి పెంచలయ్య, నీలం సాయికుమార్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, మండలి కృష్ణారావు, బండారు మహేష్ నాయుడు, పోలిశెట్టి శ్రీనివాసులు, సున్నా మురళి, కాసా చక్రపాణి, జంధ్యం వెంకటసుబ్బయ్య, ఆకూరి చిట్టిబాబు, సుంకే మాల్యాద్రి, పాకం రవీంద్రబాబు, బీమా రంగారావు, ఓగిరాల సుధాకర్, కట్టం శేషయ్య, సూరిశెట్టి శేషయ్య, అండే కోటేశ్వరరావు, దిండు శ్రీనివాసులు, పాలకం శేషయ్య, పాకం శేషగిరిరావు, తూపిలి మురళి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కావలి–నెల్లూరు నాన్‌స్టాప్ ప్రయాణ సమయం తగ్గింపు

కావలి: కావలి–నెల్లూరు మధ్య తిరుగుతున్న నాన్‌స్టాప్ బస్సు ప్రయాణంలో మారిన సమయం ఆదా అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాఘురు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. కావలి నుంచి నెల్లూరు వెళ్లే నాన్‌స్టాప్ బస్సుకు బస్టాండ్‌లో టికెట్ ఇచ్చిన తరువాత, ముసునూరు వద్ద లోపు ఎక్కిన ప్రయాణికులకు ముసునూరు వద్ద టికెట్ ఇచ్చే ఏర్పాట్లు ఉండేవని, అదేవిధంగా నెల్లూరు నుంచి కావలికి వచ్చే సమయంలో ఐనమడుగు రోడ్డు వద్ద టికెట్లు ఇచ్చేవారని తెలిపారు. ఆ కారణంగా కొంత సమయం వృథా అయ్యేదని, ఇకపై మధ్యలో ఎక్కిన ప్రయాణికులకు బస్సులోనే డ్రైవర్ టికెట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని, తద్వారా సమయం వృథా కాదని తెలిపారు. ప్రయాణికులు కావలి–నెల్లూరు నాన్‌స్టాప్ సర్వీసులను ఆదరించాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

కోలాహలంగా యూత్ రిట్రీట్



నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్ట్ చర్చి డొనిహాల్ వాళ్లక ఒక రోజు యూత్ రిట్రీట్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించిన సంఘ కాపరి రెవరెండ్ క్యామ్‌సన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పాస్టర్ ఆండ్రూస్ (తిరుపతి), పాస్టర్ జాన్‌వెస్లీ (చీరాల) బైబిల్ సందేశాన్ని అందించారు. పరివర్తన నాటిక ప్రత్యేకాకర్షణగా నిలిచింది. బైబిల్ క్విజ్, పాటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. క్రైస్ట్ డైరెక్టర్ విల్లీ క్యామ్‌సన్ నేతృత్వంలో జానీజో, క్రైస్ట్ క్యామ్‌సన్ బృందాలు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 50 చర్చిల నుంచి 500 మంది యువత హాజరయ్యారు. సంఘ చైర్మన్ సురేంద్ర, కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, కోశాధికారి విజయభాస్కర్, యూత్ డైరెక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

యానాదుల సంక్షేమ సంఘ సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన టికెట్లను యానాదులకు కేటాయించాలని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ భవన్‌లో గురువారం నిర్వహించిన యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాదుల నివాసిత కాలనీలను అధికారులు సందర్శించాలని కోరారు. మేయర్ స్రవంతి, నేతలు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసచక్రవర్తి, సుబ్బారావు, బ్రహ్మయ్య, ప్రభావతి, సతీష్‌చంద్ర, రమేష్, శ్రీనివాసరావు, ఉషా, వరలక్ష్మి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.